సాక్షి
విజయనగరం
శనివారం ¦ 24 ¦ ఫిబ్రవరి ¦ 2024



యువ శాస్త్రవేత్తలకు అవకాశం

యువ శాస్త్రవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కృషి చేస్తోంది. - 8లో



తెలగ జాతి ఆత్మగౌరవాన్ని నిలబెడదాం - 8లో

తెలగ జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే సమయం ఆసన్నమైందని ఆ సంఘ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు పి.వి.రావు అన్నారు.



టీడీపీపై జనసేన గరం గరం

టీడీపీ నాయకులతీరుపై జనసేన కార్యకర్తలు, నాయకులు మండిపడుతున్నారు. కనీసం విలువ ఇవ్వని టీడీపీకి ఓటెందుకు వేయాలని ప్రశ్నిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

27న గ్రీవెన్స్ డే

విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఈ నెల 27న గ్రీవెన్స్‌డే నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు శుక్రవారం తెలిపారు. వైద్యారోగ్యశాఖ పరిధిలో పని చేసే ఉద్యోగులు తమ జీత, భత్యములపై సమస్యలుంటే వినతులు ఇవ్వవచ్చన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు రిఫరీలుగా జిల్లా పీడీలు



జాతీయ కబడ్డీ పోటీలకు రిఫరీలుగా నియామకమైన జిల్లా పీడీలు

విజయనగరం: విశాఖ పోర్టు స్టేడియంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు అఖిల భారత పోర్టు ట్రస్టుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నవి. ఇందులో భాగంగా అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన క్వాలిఫైడ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన జిల్లాకు చెందిన ముగ్గురు పీడీలను రిఫరీలుగా నియమిస్తూ విశాఖ పోర్టు చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో రిటైర్డ్ పీడీ బొమ్మన రామారావు, కుమిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ఎ.ఎం.ఎస్.కమలనాభరావు, అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ఎస్.సూర్యారావు ఉన్నారు.

28 వరకు గడువు పెంపు

విజయనగరం ఫూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2024–25 విద్యాసంవత్సరానికి గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈనెల 28వ తేదీ వరకు పెంచినట్టు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త టి.పద్మజ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఐదవ తరగతికి మార్చి 10వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్‌కు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని 0–5 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లందరికీ పోలియో చుక్కలు వేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై పీహెచ్‌సీ, యూహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఇటుక బట్టీలు, గిరిశిఖర ప్రాంతాల్లో నివసించే పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఏ కారణం చేతనైనా తప్పిపోయిన పిల్లలకు 4, 5 తేదీల్లో పోలియో చుక్కలు వేయాలన్నారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆస్పత్రుల్లో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎంఓ డాక్టర్ జాన్, డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్చుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రథంపై రాములోరు..



భక్తుల జయజయధ్వానాల నడుమ సాగుతున్న రాములోరి రథయాత్ర

- రామతీర్థంలో శోభాయమానంగా సాగిన రథయాత్ర
- తిరువీధుల్లో ఊరేగిన సీతారామస్వామి
- స్వామివారి సన్నిధిలో వైభవంగా పండిత పరిషత్తు
- స్వామివారి రథయాత్రలో పాల్గొన్న అశేష భక్తజనం



ఆలయంలో పండిత పరిషత్తు నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానం శుక్రవారం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. స్వామివారి తిరుక్కల్యాణం అనంతరం ఎప్పటివలే మూడోరోజు నిర్వహించిన రథయాత్రను కనులారా తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. అర్చకులు స్వామివారికి ఉదయం గ్రామబలిహరణం చేపట్టి శ్రీరాముడి సన్నిధిలో శ్రీమద్రామాయణ పారాయణ, వేదపఠనం, వైదిక సదస్యం తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు. సాయంత్రం 6 గంటలకు వేద పండితులంతా పండిత పరిషత్తును నిర్వహించి నాలుగు వేదాలను భక్తి శ్రద్ధలతో పఠించారు. స్వామివారి విశేషాన్ని వివరిస్తూ మంగళవాయిద్యాల నడుమ ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ ప్రదక్షణ జరిపారు. అనంతరం సీతారామస్వామివారిని ప్రత్యేక రథంపై ఆశీనులను చేసి పూజలు నిర్వహించారు.

ఉత్సవంగా రథయాత్ర

రాత్రి సుమారు 10 గంటలకు వేద పండితుల వేదమంత్రోచ్చారణ, భక్తుల జయజయధ్వానాల నడుమ సీతారామ లక్ష్మణులు రామతీర్థం పురవీధుల్లో ఊరేగి వేలాది మంది భక్తులకు కనువిందు చేశారు. మూడు గంటల పాటు జరిగిన ఈ రథయాత్ర మహోత్సవంతో రామతీర్థం పులకించింది. ఆలయ ప్రతిష్ఠ జరిగిన నాటి నుంచి ఆనవాయితీగా వస్తోన్న సీతారామునిపేట, జగ్గరాజుపేట, గొర్లిపేట గ్రామస్తులు స్వామివారి రథాన్ని భక్తి శ్రద్ధలతో లాగి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. స్వామివారి ఊరేగింపునకు ముందు పండిత పరిషత్తు వైభవంగా జరిగింది. ఈ పరిషత్తులో సీతారాముల గుణగణాలను తెలియపర్చడానికి వేదపండితులు పోటీపడిన సన్నివేశం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వేద పండితులను దేవస్థానం తరపున ఘనంగా సన్మానించారు.

పోటెత్తిన భక్తులు

స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించిన రథయాత్రకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. విజయనగరం, నెల్లిమర్ల ప్రాంతాలతో పాటు ఏటీ అగ్రహారం, దన్నానపేట, తంగుడుబిల్లి, గొర్లిపేట, కొత్తపేట, సతివాడ, రామతీర్థం, ఒమ్మి, తదితర పరిసర గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి రథయాత్రను తిలకించారు. పూజా సామగ్రిని రథంపైకి విసిరి స్వామివారిని దర్శించుకున్నారు. రథయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. దేవస్థానం ఈఓ వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, పవన్‌కుమార్ తదితరులు కార్యక్రమాన్ని వేడుకగా జరిపించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరు
- ప్రతి రైతు గుండెలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి స్థానం
- ఇచ్చిన మాటకు కట్టుబడి సాగునీటి ప్రాజెక్టులు పూర్తికి చర్యలు
- టీడీపీ హయాంలో దగాపడిన ఉత్తరాంధ్ర ప్రజలు
- వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం: వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజల ఓట్లతో పదవులు అనుభవించిన టీడీపీ నేతలు మోసం చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంత ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుందని వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై 'ఈనాడు'లో ప్రచురించిన తప్పుడు కథనాన్ని మీడియా సాక్షిగా శుక్రవారం ఖండించారు. మరో 50 రోజుల్లో ఎన్నికలు జరగనున్నవేళ.. పచ్చమీడియా వండివార్చుతున్న తప్పుడు కథనాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎవరు మేలుచేస్తారో ప్రజలకు తెలుసన్నారు.

చంద్రబాబు పెద్ద మోసకారి

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న సమయంలో ఉత్తరాంధ్ర ప్రజలను నిలువునా ముంచేశారని జెడ్పీ చైర్మన్ విమర్శించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని విస్మరించారన్నారు. రైతులు, డ్వాక్రా మహిళలను రుణమాఫీ పేరుతో మోసం చేశారన్నారు. అందుకే 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ మట్టికరిపించారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఉత్తరాంధ్ర 34 శాసనసభ, 5 పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న వారంతా పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారేనని, గడిచిన 57 నెలల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వారందరికీ అన్నివిధాలా మేలు జరిగిందన్నారు. వ్యవసాయం కలిసిరావడంతో వలసలు తగ్గుముఖం పట్టాయన్నారు. విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు చేరువయ్యాయని, ప్రతి కుటుంబం ఆర్థికోన్నతి చెందిందని చెప్పారు.

- వైఎస్సార్ హయాంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించి రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో రెండు ఇటుకలు వేసి శంకుస్థాపన చేసి వదిలేసిన తోటపల్లి ప్రాజెక్టు పనులను పూర్తి పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సాగునీటిని అందించారన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కనీసం మిగులు పనులు చేయలేదన్నారు. మళ్లీ 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.150 కోట్లతో మిగులుపనులు పూర్తి చేస్తున్నట్టు వెల్లడించారు.
- జంఝావతిపై రబ్బర్ డ్యామ్‌ను నిర్మించి ఆ ప్రాంత రైతులక సాగునీటి కష్టాలు తీర్చిన ఘనత వైఎస్సార్‌దేనన్నారు. ఈ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచి మంత్రి పదవులు అనుభవించిన అశోక్‌గజపతిరాజు, కళా వెంకటరావులు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.
- తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు కోసం టీడీపీ మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు ముందడుగువేస్తే అదే పార్టీ నాయకులు అడ్డుకున్నారని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పనులు ప్రారంభించారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం 2014లో అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించి రూ.780 కోట్లతో పనులు చేపట్టేందుకు పాలనాపరమైన అనుమతులివ్వగా... రూ.200 కోట్లతో పనులు ప్రారంభించినట్టు వెల్లడించారు. విజయనగరం ప్రజలకు శాశ్వత మంచి నీటి సదుపాయాన్ని కల్పించడంతో పాటు భోగాపురంలో నిర్మిస్తోన్న అంతర్జాతీయ విమానాశ్రయానికి నీరు అందిస్తామని చెప్పుకునేందుకు గర్వంగా ఉందన్నారు.
- ఆంధ్ర, పెద్దగెడ్డ, ఒట్టిగట్ట రిజర్వాయర్‌లకు జైకా నిధులు ఖర్చుపెట్టి పనులు చేస్తున్నామన్నారు. వంశధార నిర్వాసితులకు గతంలో ఇచ్చిన ప్యాకేజీ సరిపోదని చెప్పడంతో రూ.205 కోట్ల మొత్తాన్ని పరిహారం కింద మంజూరు చేసినది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు.
- మహేంద్ర తనయ నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టి 24వేల ఎకరాలకు సాగునీరు అందించే పనులు జరుగుతున్నాయన్నారు. ఉద్దానం ప్రజల కోసం ప్రత్యేకంగా ప్రాజెక్టును నిర్మించారన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తిచేస్తామని చెప్పారు.
- ఐదేళ్లుగా వరుణుడు కరుణించాడని, రైతులకు పంటలు కలిసివచ్చాయని జెడ్పీ చైర్మన్ అన్నారు. ఉత్తరాంధ్రలో కరువు లేదనేందుకు 10 నుంచి 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు విక్రయించడమే సాక్ష్యమన్నారు. ఆయన వెంట రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు ఉన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఎస్.డి.అనిత

- 80 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 26,452 మంది అభ్యర్థులు
- డీఆర్వో ఎస్.డి.అనిత

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 25న జరగనున్న గ్రూప్–2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత తెలిపారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు జరుగుతుందని, జిల్లాలోని 80 కేంద్రాల్లో 26,452 మంది పరీక్ష రాయనున్నట్టు వెల్లడించారు. 80 కేంద్రాలకు 24 రూట్లుగా విభజించి 24 మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లగా నియమించామని చెప్పారు. వీరితో పాటు లైజన్ అధికారులుగా తహసీల్దార్లను నియమించామన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో రూట్, లైజన్ ఆఫీసర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రశ్న పత్రాలు తీసుకున్న దగ్గర నుంచి పరీక్ష అనంతరం ఆన్సర్ పేపర్లను సబ్‌మిట్ చేసే వరకూ చీఫ్ సూపరింటెండెంట్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటల తర్వాత మెయిన్ గేట్లను మూసివేయాలని, పరీక్ష పూర్తయిన తర్వాత 1 గంటకు అభ్యర్థులను బయటకు విడిచిపెట్టాలని సూచించారు. దివ్యాంగులు, గర్భిణులకు వీలున్నంతవరకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీపీఎస్సీ సభ్యుడు శంకర్‌రెడ్డి మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా 899 పోస్టుల కోసం 4,83,525 మంది అభ్యర్థులు గ్రూప్ 2 స్క్రీనింగ్ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటరావు, ఇతర సిబ్బంది, పలు కళాశాలల, పాఠశాలల యాజమాన్యాలు, చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు సూచనలు

- హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- పరీక్ష హాల్‌కు సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్, మరే విధమైన ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదు.
- దివ్యాంగత్వం 40 శాతం పైబడిన వారు స్రైబ్‌ను స్వయంగా తీసుకురావచ్చు. అభ్యర్థి విద్యార్హత కంటే తక్కువగా ఉండాలి.

1,897 పోలింగ్ కేంద్రాలు ఖరారు

- రెండు కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ నాగలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో మొత్తం 1,897 పోలింగ్ కేంద్రాలు, రెండు కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ముఖ్య కార్యనిర్వహణాధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 1,847 పోలింగ్ కేంద్రాలతో పాటు, సాలూరు నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలంలో 50 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 1,897 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్టు వెల్లడించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపు సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

ఓట్ల లెక్కింపు కోసం లెండి ఇంజినీరింగ్ కళాశాల, సెంచూరియన్ యూనివర్సిటీ భవనాలను పరిశీలించి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపునకు సంబంధించిన ఫారం–6, 7, 8ల పురోగతిని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, ఈఆర్‌ఓలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, డీటీలు పాల్గొన్నారు.

5,186 మందికి ఇళ్ల పత్రాల పంపిణీ



కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థల రిజిస్టర్ పట్టాను అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పేదల పేరిట రిజిస్టర్ చేసిన ఇళ్ల స్థల పత్రాలను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఒంగోలులో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం శ్రీకారం చుట్టారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో తిలకించిన అనంతరం జిల్లాలోని లబ్ధిదారులకు రిజిస్టర్డ్ పట్టాలను కలెక్టర్ అందజేశారు. విజయనగరం మున్సిపాలిటీ పరిధిలో రెండో విడత కింద సారిక ఏబీసీడీ లేఅవుట్లలో 3,403 మందికి, జమ్ము నారాయణపురంలో 1,053 మందికి, 90 రోజుల కార్యక్రమం కింద గుంకలాం లేఅవుట్‌లో 730 మందికి కలిపి 5,186 మంది లబ్ధిదారులకు పట్టాల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు, డీఈలు, ఏఈలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు బొబ్బిలి కోర్టు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

- హాజరుకానున్న సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు

బొబ్బిలి: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు కొత్త భవనసముదాయం నిర్మాణ పనుల శంకుస్థాపనకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి బి.నరసింహ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాగూర్, హైకోర్టు న్యాయవాదులు శనివారం బొబ్బిలి రానున్నారు. మధ్యాహ్నం 3–4 గంటల మధ్య జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేసి తిరుగుప్రయాణమవుతారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి బి.సాయికళ్యాణ చక్రవర్తి, కలెక్టర్ జి.నాగలక్ష్మి తదితరులు పాల్గొననున్నారు. బొబ్బిలిలో కోర్టు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.31.20 కోట్లు మంజూరు చేసింది. అధునాతన విధానంలో కోర్టు భవనాలను నిర్మించనున్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట అప్పలనాయుడు కృషితో ఎట్టకేలకు కోర్టు కొత్త భవనానికి శంకుస్థాపన రాయి పడనుండడంతో న్యాయవాదులు, ప్రజలు, కక్షిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

- తండ్రి, సవతి తల్లిని హత్యచేసిన కొడుకు
- అనాథగా మారిన చిన్నారి
- బొండపల్లిలో విషాదం





హత్యకు గురైన రాము, జయలక్ష్మి(ఫైల్)



హత్యకు పాల్పడిన నిందితుడు లక్ష్మణరావు



అనాథగా మారిన జయలక్ష్మి, రాముల కుమార్తె చంద్రిక



హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బొండపల్లి: కుటుంబ కలహాలతో క్షణికావేశానికి లోనైన యువకుడు సొంత తండ్రితో పాటు సవతి తల్లిని కిరాతకంగా కత్తితో నరికి చంపిన దారుణ ఘటన బొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. గజపతినగరం సీఐ ఎస్.వి.ప్రభాకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డోల రాము(52)కు గతంలో లక్ష్మితో వివాహమైంది. ఆమెకు నిందితుడు లక్ష్మణరావు(26)తో పాటు, పెద్ద కొడుకు పైడిరాజు ఉన్నారు. మొదటి భార్య వేరే పెళ్లి చేసుకోవడంతో కొన్నేళ్ల కిందట రాము కూడా బొండపల్లి మండలంలోని గిట్టుపల్లి గ్రామానికి చెందిన జయలక్ష్మి (49)ని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి 13 సంవత్సరాల వయస్సు ఉన్న కుమార్తె ఉంది. తండ్రి, సవతి తల్లి నివసిస్తున్న ఇంటికి సమీపంలో రేకులషెడ్డు వేసుకొని నిందితుడు వేరేగా జీవనం సాగిస్తున్నాడు. నిందితుడికి, హత్యకు గురైనవారికి కొంతకాలంగా కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. అదే కోవలో శుక్రవారం ఉదయం ఘర్షణ పడ్డారు. ఇది కొట్లాటకు దారితీసింది. లక్ష్మణరావు ఇంటిలోని కత్తిని తెచ్చి తండ్రి రాముపై విచక్షణా రహితంగా దాడిచేశాడు. అడ్డుగా వచ్చిన సవతి తల్లిపైనా దాడిచేశాడు. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. ఘటనా స్థలాన్ని ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఎం.జావలీతో పాటు, బొండపల్లి, గజపతినగరం పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు కె.లక్ష్మణరావు, యు.మహేష్ పరిశీలించారు. మృతదేహాలకు శవపంచనామా జరిపి పోస్టుమార్టం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల మృతితో బొండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కుమార్తె చంద్రిక అనాథగా మారింది.

పరుగు తీసిన జనం

చిన్నపాటి గొడవ ఇద్దరి హత్యకు దారితీసిన ఘటనతో గ్రామస్తులు భయాందోళన చెందారు. పరుగు తీశారు. నిందితుడు లక్ష్మణరావు విద్యుత్ పనులు చేయడంతో పాటు ఇటీవల ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడికి ఎటువంటి అలవాట్లు లేవని, ఒక్కసారిగా హత్యకు పాల్పడడంతో ఆశ్చర్యచకితులవుతున్నారు. హత్యచేసిన తర్వాత నిందితుడు కాసేపు అక్కడే ఉండి తర్వాత పరారయ్యాడు. అయితే, పోలీసులు గాలించి అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

వైఎస్సార్‌సీపీ పరిశీలకుల నియామకం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉమ్మడి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో మరోసారి విజయ పతాకం ఎగురవేయడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో అనుసంధానంగా పనిచేస్తూ పార్టీ శ్రేణులను విజయపథంలో నడిపించడానికి అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది.

అసెంబ్లీ నియోజకవర్గం	పరిశీలకుని పేరు
రాజాం	కేవీ సూర్యనారాయణరాజు
గజపతినగరం	పీవీవీ సూర్యనారాయణ రాజు (డాక్టర్ సురేష్‌బాబు)
బొబ్బిలి	డోల జగన్
చీపురుపల్లి	సువ్వారి గాంధీ
నెల్లిమర్ల	నెక్కల నాయుడుబాబు
విజయనగరం	జమ్మాన ప్రసన్నకుమార్
పాలకొండ	కిల్లి సత్యనారాయణ
కురుపాం	వాకాడ నాగేశ్వరరావు
పార్వతీపురం	టి.భాస్కరరావు

క్లుప్తంగా

పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల ఏర్పాటుకు జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్సు ద్వారా శుక్రవారం సమీక్షించారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను రెండు రోజులలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో కనీస వసతుల కల్పన, ఎన్నికల అధికారులు, సిబ్బంది నియమాకం, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల అక్రమ రవాణా నియంత్రణ, పత్రికలలో వచ్చిన వార్తలు, తదితర అంశాలపై తీసుకొంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓలు కె.హేమలత, వివి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సహాయకురాలు సస్పెన్షన్

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకురాలు ఎస్.పద్మావతిని సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆదేశాలు జారీ చేసినట్టు ఏపీఓ ఎం.గౌరీనాథ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని మరుపెంట, కొంకడివరం, చినగుడబ, సంతోషపురం పంచాయతీలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న ఈమె విధులలో నిర్లక్ష్యం వహించడంతో పాటు, పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోవడం, వేతనదారులకు పనులు కల్పించకపోవడం, పనులలో ముందస్తుగా కొలతలు ఇవ్వకపోవడం తదితర కారణాలతో విధులను తొలగించడం జరిగిందన్నారు. ఉపాధి సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

యువకుడి ఆత్మహత్య

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో వలస కూలీగా వచ్చిన మింది వీరబాబు (22) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా వున్నాయి. అల్లూరి సీతరామరాజు జిల్లా రాజవమ్మంగి మండలం భూసరపాడు గ్రామానికి చెందిన మింది వీరబాబు (22) విజయనగరం జిల్లా వేపాడ మండలం బొద్దాం గ్రామంలో వలస కూలీగా గత నాలుగేళ్లుగా వచ్చి పని చేస్తున్నాడు. అప్పుల బాధ తాళలేక శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడటంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందడంతో ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

పాచిపెంట: మండల కేంద్రంలోని ఎరుకుల వీధిలో భార్యపై భర్త హత్యాయత్నం చేశాడు. దీనిపై ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాలు.. ఎరుకుల వీధికి చెందిన దాసరిసోములు, భార్య అసిరమ్మలకు వివాహమై సుమారు 20 సంవత్సరాలైంది. ఇటీవల కొన్ని నెలలు క్రితం వారు విడిపోయి ఎవరికి వారే మండల కేంద్రంలో జీవనం సాగిస్తున్నారు. అసిరమ్మకు జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైన నేపథ్యంలో తన ఆధార్ కార్డు కోసం సోములు వద్దకు శుక్రవారం అసిరమ్మ వచ్చింది. ఈ క్రమంలో అసిరమ్మ, సోములు మధ్య వాగ్వాదం జరగ్గా అసిరమ్మ కడుపులో సాములు కత్తితో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమైన అసిరమ్మను వెంటనే స్థానికులు పాచిపెంట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఈస్ట్‌కోస్ట్ జోన్‌లో 22 అమృత్ స్టేషన్లు

భువనేశ్వర్: ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో కొత్తగా 22 అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల నిర్మాణానికి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 26న శంకుస్థాపన చేస్తారని జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం తెలిపారు. మంజూరైన రూ.790 కోట్లు వెచ్చించి ఈ స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా స్టేషన్ల సౌకర్యాలను మెరుగుపరిచి ప్రయాణికులకు ప్రయాణం మరింత సౌకర్యవంతం చేయనున్నట్లు వివరించారు. కొత్త అమృత్ భారత్ స్టేషన్ల జాబితాలో నౌపడ, సింహాచలం, బొబ్బిలి, శ్రీకాకుళం రోడ్, పార్వతీపురం, చీపురుపల్లి, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగుడ రోడ్, అరకు, కొత్తవలస, ఇచ్ఛాపురం తదితర స్టేషన్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹ 270

యువ శాస్త్రవేత్తలకు అవకాశం

- 9వ తరగతి విద్యార్థులు అర్హులు
- ఇస్రో ఆధ్వర్యంలో దరఖాస్తుల ఆహ్వానం
- మార్చి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం



కంచరాం పాఠశాలలో ప్రయోగం చేస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: యువ శాస్త్రవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కృషి చేస్తుంది. ఇందులో భాగంగా యువికా-2024 (యువ విజ్ఞాన కార్యక్రమం) యువ శాస్త్రవేత్తలను తయారుచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 9వ తరగతి చదివే విద్యార్థుల నుంచి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. రాబోయే తరాల్లో శాస్త్రవేత్తలను గుర్తించే దిశగా ఇస్రో దృష్టి సారించింది. ఇందుకు దేశ వ్యాప్తంగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తుంది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎస్ఆర్‌ఓ.జీఓవీ.ఐఎన్‌లలో దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 20 నుంచి మార్చి 20 వరకు అవకాశం కల్పించింది. అర్హులను ఎంపిక చేసి మొదటి జాబితా మార్చి 28న, రెండవ జాబితా ఏప్రిల్ 4న ఆన్‌లైన్‌లోనే ప్రకటించనుంది.

దరఖాస్తు చేయండిలా..

విద్యార్థులు నాలుగు దశల్లో దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ప్రతి దశలో జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలి. అసంపూర్తి దరఖాస్తులు తిరస్కరిస్తారు.

యువికా-2024 కోసం ఏర్పాటు చేసిన డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎస్ఆర్‌ఓ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో విద్యార్థులు సొంత ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. క్విజ్ సూచనలు చదవడం, ఈ-మెయిల్ 48 గంటల వ్యవధిలో ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. క్విజ్ అప్‌లోడ్ చేసిన 60 నిమిషాల తరువాత యువికా పోర్టల్‌లోని ఆన్‌లైన్ దరఖాస్తులో పూర్తి వివరాలు నమోదు చేయాలి. అనంతరం డౌన్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు విద్యార్థి సంతకం చేసిన ప్రతిని, విద్యార్థి మూడేళ్లలో వివిధ అంశాల్లో రూపొందించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలి. ఇందులో ఎంపికైన వారిని ఇస్రో వడబోసి తుది జాబితా అదే నెల 20న వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

అర్హులు వీరే....

ఈ ఏడాది మార్చి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. వీరు ఎనిమిదో తరగతిలో వచ్చిన మార్కులతో పాటు గత మూడు సంవత్సరాల్లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని ఉండాలి. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్‌లలో సభ్యులై ఉండాలి. ప్రతి రాష్ట్రం నుంచి విద్యార్థుల భాగస్వామ్యం ఎంత నిష్పత్తిలో ఉండాలో నిర్ధారిస్తారు. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కావడంతో పాటు మార్చి 20 చివరి తేదీగా నిర్ణయించారు.



యువికా-2024 లోగో

మంచి అవకాశం



యువ శాస్త్రవేత్తలకు ఇస్రో మంచి అవకాశం కల్పించింది. ఈ కార్యక్రమానికి 9వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఆసక్తి గల విద్యార్థులు మార్చి 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేసుకున్న వారికి క్విజ్ రూపంలో పలు ప్రశ్నలు ఉంటాయి. ఇంతటి మంచి అవకాశాన్ని ఆసక్తి ఉన్న 9వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– పందూరు వేణుగోపాల్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు, జెడ్‌పీహెచ్ఎస్, కంచరాం, రాజాం

రాష్ట్రానికి ముగ్గురు చొప్పున అవకాశం

ఎంపికైన విద్యార్థులకు విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ (తిరువనంతపురం), యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ (బెంగళూరు), స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (అహ్మదాబాద్), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (హైదరాబాద్), నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (షిల్లాంగ్), ఐఐఆర్ఎస్ (డెహ్రాడూన్), శ్రీహరికోట అంతరిక్ష కేంద్రాలలో మే 16 నుంచి 28 వరకు 13 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

ఆశ్రమపాఠశాలను సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్



ఎర్రసామంతవలసలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి.శంకర్రావు

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలను ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకర్రావు శుక్రవారం సందర్శించారు. ఇటీవల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి అశోక్ మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందుతున్న వసతి సౌకర్యాలు, భోజనం, విద్యాబోధన తదితర అంశాలపై ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థుల చదువు, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి అశోక్ మృతి చెందడం, బాధాకరమని, మున్ముందు ఇటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు ఆరోగ్య పరిస్థితిని ఉపాధ్యాయులు తెలుసుకోవాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తరుచూ ఆశ్రమ పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు. వసతిగృహ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాల సందర్శనలో సహాయ గిరిజన సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలగ జాతి ఆత్మగౌరవాన్ని నిలబెడదాం

- 25న పూసపాటిరేగలో భారీ బహిరంగ సభ
- ఉత్తరాంధ్ర తెలగ సంఘం అధ్యక్షుడు పీవీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న పీవీఆర్

విజయనగరం టౌన్: తెలగ జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే సమయం ఆసన్నమైందని, తెలగ కులంలో పుట్టిన ప్రతి బిడ్డకోసం బీసీ రిజర్వేషన్ సాధించేందుకు చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాలుపంచుకోవాలని ఉత్తరాంధ్ర తెలగ సంఘం అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు (పీవీఆర్) పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ సాధించేందుకు ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకూ సుమారు 665 కిలోమీటర్లు నిర్వహించిన ఉత్తరాంధ్ర పాదయాత్రలో ప్రతి తెలగ కులస్తుడు తన అభిమానాన్ని చాటుకున్నారన్నారు. దారి పొడవునా తనకు ధైర్యాన్ని కల్పించారన్నారు. పాదయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నామన్నారు. ఉత్తరాంధ్ర తెలగ గర్జన, తెలగ జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఈ నెల 25న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. తెలగ జాతిలో పుట్టిన ప్రతి బిడ్డ సభకు హాజరై, తమ ఉనికిని చాటిచెప్పాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే రిజర్వేషన్ ప్రక్రియను తన మేనిఫెస్టోలో చేర్చి సక్రమంగా అమలుచేస్తుందో ఆ పార్టీకీ పూర్తి మద్దతు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా చలో పూసపాటిరేగ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పెద్ది లక్ష్మీనారాయణమూర్తి, కోలా నారాయణ అప్పారావు, మొంగం శ్రీనివాసరావు, సుంకర సూర్యనారాయణ, ఎర్నాగుల చక్రవర్తి, మాతా గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



108లో ప్రసవించిన గిరిజన మహిళ

సీతంపేట: మండలలలోని జొన్నోడు చీపురుగూడ గ్రామానికి చెందిన సవర లావణ్య అనే గిరిజన మహిళ 108లో గురువారం అర్ధరాత్రి ప్రసవించింది. పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. వెంటనే ఈఎంటీ లిమ్మక రాములు, పైలెట్ శంకరరావు గ్రామానికి వెళ్లి అంబులెన్స్‌లో తీసుకువస్తుండగా మార్గమధ్యానికి వచ్చేసరికి పురిటి నొప్పులు ఎక్కువై ఉమ్మనీరు లీకైంది. సిబ్బంది చాకచక్యంగా ప్రసవం చేశారు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారు.

టీడీపీపై జనసేన గరం గరం



టీడీపీ-జనసేన విస్తృత స్థాయి సమావేశంలో జనసేన ఇన్‌చార్జ్ మల్లేష్‌తో వాదనకు దిగిన జనసేన కార్యకర్తలు

- కురుపాం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో టీడీపీ నాయకుల తీరుపై జనసేన నేతల అసంతృప్తి

కురుపాం: కురుపాం నియోజకవర్గ టీడీపీ నాయకులపై జనసేన కార్యకర్తలు, నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం సమీపంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగదీశ్వరి అధ్యక్షతన జరిగిన టీడీపీ-జనసేన విస్తృత స్థాయి సమావేశం రచ్చరచ్చగా సాగింది. సమావేశానికి హాజరైన జనసేన నాయకులు కార్యకర్తలు మొదట టీడీపీలో వర్గపోరు లేకుండా చూసుకోవాలని, ఒక వర్గం సమావేశానికి వచ్చి ఇంకొక వర్గం ఎందుకు రాలేదని ప్రశ్నించారు. లోకేష్ శంఖారావం సభలో కూడా తమల్ని ఆహ్వానించకుండా పక్కన పెట్టారని, టీడీపీ కార్యక్రమాలకు, సమావేశాలకు కనీసం జనసేన నాయకులకు తెలియజేయకపోవడం సరికాదని టీడీపీ వర్గీయులపై జనసేన కార్యకర్తలు, నాయకులు ఆగ్రహించారు. జనసేన కార్యకర్తలు, నాయకులకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించిన జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లేష్‌పై కూడా జనసేన కార్యకర్తలు, నాయకులు తిరగబడి నువ్వు టీడీపీతో కలిసి వెళ్తే వెళ్లవచ్చు కానీ తాము మాత్రం టీడీపీ ఒక తాటి మీదకు వస్తేనే పాల్గొంటామని తెగదెంపులు చేసి తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమావేశం ఇలా రచ్చ రచ్చ కావడంతో భవిష్యత్‌లో జరగబోయే ఎన్నిల్లో టీడీపీ-జనసేన పాత్ర అగమ్యగోచరంగా మారింది.

నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన అవసరం

- ఏపీ డీఐజీ ట్రైనింగ్ రాహుల్‌దేవ్ శర్మ



మాట్లాడుతున్న ఏపీ డీఐజీ ట్రైనింగ్ రాహుల్‌దేవ్ శర్మ

విజయనగరం క్రైమ్: పోలీస్ శిక్షణా కళాశాలలో శిక్షణ పొందుతున్న పోలీసులు నూతన చట్టాలపై అవగాహన తప్పని సరిగా కలిగి ఉండాలని ఏపీ డీఐజీ ట్రైనింగ్ రాహుల్ దేవ్ శర్మ సూచించారు. స్థానిక పీటీసీని శుక్రవారం ఆయన సందర్శించారు. పీటీసీలో చేపడుతున్న కార్యక్రమాలను, అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఐజీ మాట్లాడుతూ కొత్త చట్టాలలో నూతనంగా పొందుపరిచిన మార్పులు, వాటి వలన కలిగే ఉపయోగాలు తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా ఎటువంటి సమస్యకైనా చేపట్టాల్సిన పరిష్కార మార్గాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆన్‌లైన్‌లో చేపడుతున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీటీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ-2 సంఘం జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం



ఎంఈఓ-2 సంఘం జిల్లా నూతన కమిటీ

విజయనగరం అర్బన్: జిల్లాలో పని చేస్తున్న మండల విద్యాశాఖ అధికారులు-2 సంక్షేమ సంఘం నూతన కమిటీని సభ్యులు శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీని సభ్యులు ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడుగా బొబ్బిలి ఎంఈఓ-2 జి.వాసు, ప్రధాన కార్యదర్శిగా నెల్లిమర్ల ఎంఈఓ-2 ఈపు విజయకుమార్, కోశాధికారిగా గుర్ల ఎంఈఓ-2 ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎల్.కోట ఎంఈఓ-2 జి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా రామభద్రపురం ఎంఈఓ-2 ఆర్.పెంటయ్య, మహిళా సెక్రటరీగా విజయనగరం ఎంఈఓ-2 పి.సత్యవతి, రాష్ట్ర కోఆర్డినేటర్స్‌గా జామి ఎంఈఓ-2 కె.గంగరాజు, భోగాపురం ఎంఈఓ-2 బి.చంద్రమౌళిని ఎన్నుకున్నారని తెలియజేశారు. అనంతరం నూతన కమిటీ బాధ్యతలను స్వీకరించింది.

25న సబ్ జూనియర్స్ బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 25న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్ శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 2010 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 31వ తేదీ మధ్య జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు విధిగా తమ ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకు విశాఖ వేదికగా జరిగే 3వ సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాలకు 9908353698 నంబరును సంప్రదించాలని సూచించారు.

సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు రేపు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అంతర్ జిల్లాల సీనియర్స్ పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 25న నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రంగారావుదొర, కార్యదర్శి కెవి.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలోని సిటీ క్లబ్ ప్రాంగణంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 85 కేజీలలోపు బరువు కలిగి ఉండాలని, క్రీడాకారులు ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు విశాఖలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి సపక్‌తక్రా పోటీలకు జిల్లా జట్లు



రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్, జూనియర్స్ సపక్‌తక్రా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా బాల, బాలికల జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయగా.. శుక్రవారం క్రీడాకారులు పయనమయ్యారు. జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు ఈ నెల 24, 25 తేదీల్లో నెల్లూరు జిల్లా ముత్కూర్‌లో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనున్నారు. ఈ మేరకు క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా అసోసియేషన్ కార్యదర్శి వై.రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.భవాని తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ ప్రొఫెసర్‌కు గుణశేఖరన్ అవార్డు



ప్రొఫెసర్ విజయ్ బాబును అభినందిస్తున్న వీసీ మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో అప్టామెట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ విజయ్‌బాబుకు తమిళనాడులోని ప్రతిష్ఠాత్మక శాస్త్రవేత్త మధు మునైవార్ సేతు గుణశేఖరన్ అవార్డు లభించింది. దీనిపై వర్సిటీ వీసీ ప్రశాంతకుమార్ మహంతి హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల తమిళనాడులో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా విజయ్‌బాబు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీతో పాటు యూనివర్సిటీ అధ్యాపకులు శుక్రవారం ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. పరిశోధన, విస్తరణ రంగాల్లో అద్భుతాలు సృష్టించి మరిన్ని అవార్డులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు సిరిపురం విద్యార్థి



రేష్మను అభినందిస్తున్న హెచ్ఎం వి.వెంకటరమణ, ఉపాధ్యాయులు

సంతకవిటి: నేటి నుంచి సోమవారం వరకు తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోటలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాలికల ఖో-ఖో పోటీలకు సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బూరాడ రేష్మ ఎంపికై నట్టు ప్రధానోపాధ్యాయులు వి.వెంకటరమణ, పీడీ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. రేష్మను పలువురు అభినందించారు.

మిలాన్‌లో మెరిసిన సైనిక పాఠశాల విద్యార్థులు



మిలాన్- 2024లో భాగమైన కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు

విజయనగరం రూరల్: విశాఖ వేదికగా జరుగుతున్న మిలాన్- 2024 ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌లో కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు మెరిశారు. ఆఖరి రోజు నిర్వహించిన పరేడ్‌లో ఎనిమిదో తరగతికి చెందిన 72 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. వీరిలో 36 మంది క్యాడెట్‌లు మార్చింగ్ కంటింజెంట్‌లో భాగం కాగా, 6 మంది బాలికలతో సహా 36 మంది క్యాడెట్లు పాఠశాల బ్యాండ్‌లో భాగమయ్యారని సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్.శాస్త్రి తెలిపారు.